క్లుప్తంగా

విరబూసిన మే పుష్పాలు



అల్లూరి పార్కులో విరబూసిన మే పుష్పాలు

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పార్కులో మే పుష్పాలు విరబూశాయి. ఒకే చోట సుమారు 30 పుష్పాలు విరబూసి చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

సీబీఎస్ఈ ఫలితాల్లో మాడుగుల విద్యార్థిని ప్రతిభ



యాలంగి నూతన

మాడుగుల: సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాల్లో మాడుగుల విద్యార్థిని ప్రతిభ చూపింది. యాలంగి నూతన 92 శాతం మార్కులు సాధించింది. నూతన మల్కాపురం కేంద్రియ విద్యాలయంలో చదువుతోంది. తండ్రి యాలంగి బాలకృష్ణ గంగవరం పోర్టులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. తల్లి పుష్పలత గృహిణి. ఇంటర్‌లో బైపీసీ పూర్తి చేసి, ఎంబీబీఎస్ చేయడమే తన లక్ష్యమని నూతన తెలిపింది.

సైనిక్ స్కూల్‌కు కోడూరు విద్యార్థి ఎంపిక



తనూజ్ కుమార్

మాకవరపాలెం: మండలంలోని జి.కోడూరుకు చెందిన విద్యార్థి సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. గ్రామంలోని ఎస్‌జీకే స్కూల్లో చదువుతున్న గంగిరెడ్ల తనూజ్‌కుమార్ సైనిక్ స్కూల్లో ఆరోతరగతి ప్రవేశానికి పరీక్ష రాశాడు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి రాజస్థాన్‌లోని గంగానగర్ సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడని పాఠశాల కరస్పాండెంట్ వీరప్రకాశ్ బుధవారం తెలిపారు. తనూజ్‌కుమార్‌ను తల్లిదండ్రులతోపాటు స్థానికులు అభినందించారు.

80 మందికి నేత్ర వైద్య పరీక్షలు



చుక్కపల్లిలో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీడికాడ: మండలంలోని చుక్కపల్లిలో బుధవారం శంకర ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 84 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 40 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు క్యాంప్ డిప్యూటీ మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ క్యాంపులో సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ, ఎంపీటీసీ సుంకర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

31 గన్నర, ఇతర జాతి కలప దుంగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలప దుంగలు

గొలుగొండ: మండలంలోని కృష్ణదేవి పేటలో 31 గన్నర, ఇతర జాతి కలప దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు కృష్ణదేవిపేట రేంజర్ వెంకటరావు తెలిపారు. గ్రామంలో కార్పెంటర్ల ఇళ్లపై బుధవారం దాడులు జరిపి, అనుమతి లేకుండా దాచి ఉంచిన 28 దుంగలను, బైక్‌పై తరలిస్తున్న మూడు గన్నర దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. బైక్‌పై దుంగలను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా కలప రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలకు వినతి

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో మత్తు వ్యవస్థ విముక్తి విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల 9 నెలల బకాయి జీతాలు తక్షణమే విడుదల చేయాలంటూ వైద్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు ఉద్యోగులు బుధవారం వినతిపత్రం అందించారు. కాంట్రాక్టర్ ఆగస్టు 2023 నుంచి గౌరవవేతనాలు చెల్లించట్లేదని, ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వ దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎల్.శ్రీను, రాజ్యలక్ష్మి, క్రాంతికుమార్, చంద్రశేఖర్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు



దేవరాపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై గ్రామాల్లో బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా అర్ధరాత్రి వరకు పోలింగ్ జరగడంతో పాటు అత్యధికంగా పోలింగ్ శాతం నమోదు కావడంతో గెలుపు అవకాశాలను అంచనాలు వేస్తూ బెట్టింగ్ కడుతున్నారు. ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు తటస్థులు సైతం పందాలు కాస్తున్నారు. గ్రామాల్లో జరిగిన పోలింగ్ సరళిని అంచనా వేస్తూ, ఇతర గ్రామాల్లో పోలింగ్ సరళిని సైతం తమ అనుచరులు, ఇతర మార్గాల ద్వారా కనుక్కొని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వెరసి మాడుగుల నియోజకవర్గంలో బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్నాయి. దేవరాపల్లి మండలంలో ఎక్కువ మంది పందాలు కాస్తున్నారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు తమ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపొందుతారని ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే లక్షల్లో బెట్టింగ్‌లు కట్టడా, మరికొంత మంది ఒకటో తేదీన వచ్చే ఎగ్జిట్‌పోల్స్ ఆధారంగా బెట్టింగ్‌లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే అత్యధికంగా నమోదైన పోలింగ్ శాతం ఆధారంగా రాష్ట్రంలో మళ్లీ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని అధికశాతం మంది బెట్టింగ్‌లు వేయడం కనిపిస్తోంది.

నాతవరం మండలంపై...

నాతవరం: నర్సీపట్నం నియోజకవర్గంలో నాతవరం కీలకంగా మారింది. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో పెట్ల ఉమా శంకర్ గణేష్ 24,500 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. నాతవరం మండలంలో 8,341, నర్సీపట్నం మున్సిపాలిటీలో 4,581, నర్సీపట్నం రూరల్‌లో 1,873, మాకవరపాలెం మండలంలో 3,657 ఓట్ల మెజార్టీ లభించింది. నాతవరం మండలంలోనే అధిక మెజార్టీ లభించడంతో ఈ మండలంపైనే అందరి దృష్టి పడింది. ఈ మండలంలో మెజార్టీ సాధించేందుకు ప్రధాన పార్టీలు పోటీపడ్డాయి. నాతవరం ఓటర్ల తీర్పు ఆధారంగా ఎమ్మెల్యే అభ్యర్థి గెలుస్తారని పందేం రాయుళ్లు బెట్టింగ్‌లు కాసేస్తున్నారు.

అధికారుల తీరు ఆక్షేపణీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

- మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు
- అనకాపల్లి తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు–ఎంపీపీ గొర్లి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

అనకాపల్లి: మండలంలో ప్రజల సమస్యలపై దృష్టి సారించాల్సిన అధికారులు మండల సమావేశాలకు హాజరుకాకపోవడం ఆక్షేపణీయమని ఎంపీ గొర్లి సూరిబాబు అన్నారు. అనకాపల్లి తహసీల్దార్ మూడుసార్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరవడంపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పీవీఎం మోహన్‌కుమార్ అధ్యక్షత బుధవారం నిర్వహించిన 12వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సమావేశాలకు డుమ్మా కొట్టిన వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు(డీడీ) మెమోలు జారీచేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ప్రజా సమస్యలపై వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లతో జరిగే సమావేశాలకు హాజరుకాకపోవడం సరికాదన్నారు. ఇలా చేస్తే ప్రజల సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. 32 మంది పంచాయతీ కార్యదర్శులుల్లో కనీసం 10 మంది కూడా హాజరుకాలేదన్నారు. గ్రామాల్లో విద్యుత్ బిల్లు చెల్లించిన పంచాయతీలకు విద్యుత్‌ను ఎందుకు నిలుపుదల చేశారో వివరణ ఇవ్వాలన్నారు. తాగునీరు, విద్యుత్, వైద్యశాఖ, రహదారులు, వ్యవసాయ శాఖల అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు తెలిపారు. మామిడిపాలెం, పాపయ్యసంతపాలెంలో విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యల పరిష్కారానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. తగరంపూడి, సీతానగరం లైన్‌మెన్లు విధులు సక్రమంగా నిర్వహించట్లేదని, త్వరలో మార్పులు చేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ కోసం విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, విత్తనాలను పరీక్షలకు పంపిస్తున్నట్లు తెలిపారు. మరో 15–20 రోజుల్లో మండల కేంద్రాల ద్వారా ఆర్బీకేలకు విత్తనాలు చేరతాయన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహసత్యవతి, వైస్ ఎంపీపీలు విల్లూరి సూర్యకళ, అయితారాము, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు కామేశ్వరమ్మ పండగ

మాకవరపాలెం: మండలంలోని రాచపల్లి జంక్షన్‌లో కామేశ్వరమ్మతల్లి పండగను గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా అమ్మవారి పండగను స్థానికులు ఘనంగా నిర్వహిస్తారు. పండగ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సూరిశెట్టి రమణఅప్పారావు

అనకాపల్లి: తాజా ఎన్నికల్లో 123 అసెంబ్లీ, 21 ఎంపీ సీట్లలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి, సీఎంగా జగన్ విశాఖలో ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో చాలామంది ఓటర్లు తమ ఓటుకోసం సరైన అవగాహన లేక పోలింగ్ స్టేషన్ల చుట్టూ తిరిగేవారని, ఓటర్లలో చైతన్యం రావడంతో ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో బారులు తీరారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓటర్లు మరోసారి ప్రభుత్వాన్ని ఆశీర్వదించినట్లు కనిపిస్తోందన్నారు. ఈ సారి ఎన్నికల్లో అత్యధికంగా మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏడువాకల నారాయణరావు, రాపేటి మహాలక్ష్మినాయుడు, పి.కృష్ణపరమాత్మ, సత్యనారాయణ, బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల కల్యాణం



గౌరీపరమేశ్వరుల కల్యాణం చేస్తున్న అర్చకులు చక్రవర్తి



అన్నసమారాధన కార్యక్రమం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి గౌరీపరమేశ్వరులకు ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు మధ్యాహ్నం 10 వేల మందికి అన్నసమారాధన జరిపారు. రాత్రి 7 గంటలకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి గోపఅప్పలాచార్యులు(చక్రవర్తి) ఆధ్వర్యంలో దంపతులతో గౌరీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించి, స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ, ఆలయ నిర్వహణ కమిటీ, అన్నసమారాధన కమిటీ, వేల్పులవీధి పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఒకే కాన్పులో రెండు లేగదూడలు



ఇరువాడలో జన్మించిన జోడు లేగదూడ పెయ్యిలు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ గ్రామంలో మామిడి బంగారు నాయుడు అనే రైతుకు చెందిన ఆవు జోడు లేగ దూడలకు జన్మనిచ్చింది. గ్రామంలో బంగారు నాయుడు మినీ డెయిరీ నిర్వహిస్తున్నాడు. తన ఫారంలో 15 వరకూ ఆవులు ఉన్నాయి. వీటిలో హెచ్‌ఎఫ్ క్రాస్ బ్రీడుకు చెందిన ఆవు కు మంగళవారం అర్ధరాత్రి జోడు పెయ్యిలు పుట్టాయి. లేగదూడలు రెండూ ఆరోగ్యంగా ఎంతో ఉత్సాహంతో గెంతులు వేయడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

ఎవరి లెక్కలు వారివే

- వాస్తవ పరిస్థితులపై ఆరా తీస్తున్న ఇరు పార్టీలు
- పాయకరావుపేటలో 82.41 శాతం పోలింగ్



ఓటు వేయడానికి బారులు తీరిన ప్రజలు(ఫైల్)

నక్కపల్లి: తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గంలో ఓటర్లు పెద్ద ఎత్తున తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2,50,744 మంది ఓటర్లలో 2,06,626 (82.41 శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే.. కోటవురట్ల 85 శాతం, నక్కపల్లి 84 శాతం, ఎస్.రాయవరం 83 శాతం, పాయకరావుపేటలో 78 శాతం ఓటింగ్ నమోదయింది. నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు కలిగిన పాయకరావుపేట మండలంలోనే పోలింగ్ శాతం తక్కువగా నమోదవడం గమనార్హం.

గెలుపోటములపై ఇరు పార్టీలు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీకి విజయాన్ని చేకూరుస్తాయని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గడపకు అందిన లబ్ధితో మహిళలు, అవ్వాతాతలు అధిక సంఖ్యలో ఓటేసేందుకు తరలివచ్చారని చెప్పన్నారు. అంతా సైలెంట్ ఓటింగ్ జరిగిందని, ఐదేళ్లలో ఇచ్చిన హామీలు నూరు శాతం నెరవేర్చడంతో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే అవకాశం ఇస్తారన్న ధీమా పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అవ్వాతాతలకు పింఛను ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుకోవడం, చేయూత, ఆసరా, విద్యాదీవెన, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు విడుదల కాకుండా కేసులు వేయడంతో లబ్ధిదారులంతా టీడీపీపై ఆగ్రహంతో ఉన్నారని, ఈ వర్గాలన్నీ తమకు అనుకూలంగా ఓటు వేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు చెప్తున్నారు. టీడీపీ నాయకులు మాత్రం పింఛన్ల పెంపు, ఉచిత బస్సు ప్రయాణం, ఇంట్లో అందరికి అమ్మఒడి, ఉచితంగా మూడుగ్యాస్ సిలెండర్లు వంటి హామీలపట్ల మహిళలు ఆసక్తి చూపించారని, నిరుద్యోగులు, యువత, ఉద్యోగులు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారని, వారి ఓట్లన్నీ తమకే పడ్డాయని ధీమా వ్యక్తం చేస్తు న్నారు. ఇరు పార్టీల నేతలు గ్రామాల వారీ ఓటింగ్, లోటుపాట్లపై ఆరా తీసే పనిలోపడ్డారు.

జనసేన, బీజేపీ నాయకులు తమకు పూర్తి స్థాయిలో సహకరించినట్లు టీడీపీ వారు చెప్తున్నా, వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కూటమి పార్టీల మధ్య సమన్వయలేమి ఎక్కువగా కనిపించింది. ఏదేమై నా ఈ దఫా ఓటర్ల నాడి ఎవరికీ అంతు చిక్కడం లేదు. సైలెంట్ ఓటింగ్ అభ్యర్థుల్లో టెన్షన్‌కు కారణమవుతోంది.

ఓటింగ్ తీరు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు
కోటవురట్ల	44,459	37,805	18,475	19,330
నక్కపల్లి	65,289	55,227	27,665	27,562
ఎస్.రాయవరం	61,520	51,145	24,871	26,273(+1)
పాయకరావుపేట	79,476	62,449	31,400	31,049
మొత్తం	2,50,744	2,06,626	1,02,411	1,04,215

గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పాత వాలాబు విద్యార్థుల ప్రతిభ



సీట్లు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం దండుంనాయుడు

దేవరాపల్లి: గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశం కల్పించేందుకు నిర్వహించిన పరీక్షలో మండలంలోని పాత వాలాబు ప్రాథమిక పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థులు సత్తా చాటారు. వివిధ గురుకులాల్లో సీట్లు సాధించడం కోసం పది మంది విద్యార్థినీవిద్యార్థులు ప్రవేశ పరీక్ష రాశారు. వీరిలో ఏడుగురు విద్యార్థులు మంచి మార్కులతో సీట్లు సాధించి పాఠశాలకు మండల స్థాయిలో మంచి పేరు తీసుకువచ్చారు. సీట్లు సాధించిన వారిలో జె.కార్తీక్, పి.నవీన్, సీహెచ్.లోహిత్, డి.భగవాన్ సంతోష్, కె. చాందిని, పి.కోమలి, టి.అచ్చియ్యమ్మ ఉన్నారని పాఠశాల హెచ్‌ఎం కూండ్రపు దండుంనాయుడు తెలిపారు. సింహాచలంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయం, భీమిలిలోని ఏపీఆర్ బాలికల పాఠశాల, గుంటూరు గురుకుల పాఠశాలలో సీట్లు సాధించినట్టు చెప్పారు.

133 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు : ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమంలో భాగంగా కె.కోటపాడులో బుధవారం 133 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్టు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎక్కువగా నీటిని తాగాలని సూచించారు. ఉదయం 10 లోపు సాయంత్రం 5 గంటల తరువాత ప్రయాణాలను చేయడం మంచిదని నిర్మల వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, రమణ, ఏఎన్ఎం నళిని పాల్గొన్నారు.

పి. శివరామపురంలో..

మాడుగుల రూరల్: మండలంలోని పొంగలిపాక శివారు పి.శివరామపురంలో బుధవారం ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. కింతలి పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ బొడ్డేడ రవితేజ 50 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, సుగర్, వ్యాధి గ్రస్తులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ, ఎంఎల్‌హెచ్‌పీతో పాటు 104 సిబ్బంది పాల్గొన్నారు. వేసవిలో తీసుకోవలసిన జాగ్రతల గురించి వైద్యాధికారి రవితేజ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్టాపన వార్షికోత్సవం



వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

రోలుగుంట: మండలంలోని కొవ్వూరులో సిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్టాపన 22వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు బంటు రాజు, ఎస్.రామారావు, జి.రాము, శ్రీనివాసరావు, బంటు రాజుబాబు, కె.ఈశ్వరావు, రాజారావు, శ్రీనివాసరావు తదితర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమం నిర్వహించారు.

నిరుపయోగంగా పాఠశాల భవనం

వినియోగంలోకి తీసుకురావాలని వినతి



భూమిరెడ్డిపాలెంలో పాఠశాల భవనం

కె.కోటపాడు : మండలంలోని భూమిరెడ్డిపాలెంలో ప్రాథమిక పాఠశాల భవనం నిరుపయోగంగా ఉంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న కారణంగా 9 ఏళ్ల కిందట ఈ పాఠశాలను మూసివేశారు. దీంతో అప్పటి నుంచి పాఠశాల భవనం నిరుపయోగంగా మారింది. ఈ భవనాన్ని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకపోతే శిథిలావస్థకు చేరుకుని ప్రభుత్వం ధనం వృథా అవుతుందని వారు తెలిపారు.

జగనన్న వైపే మహిళల మొగ్గు

ఫ్యాన్‌కు భారీగా ఓట్లు వేసిన మహిళా ఓటర్లు



పాటిపల్లి పోలింగ్ కేంద్రంలో నిరీక్షిస్తున్న మహిళా ఓటర్లు(ఫైల్)

మునగపాక: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ తీరును పరిశీలిస్తే మహిళలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నట్లు తెలుస్తోంది. మహిళా పక్షపాతిగా సీఎం జగన్ ప్రతి పథకంలో మహిళలకే ప్రాధాన్యతనిచ్చారు. ఇళ్ల పట్టాలు, వైఎస్సార్ చేయూత, ఆసరా, అమ్మఒడి ఇలా ప్రతి పథకం వారి కోసమే. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న సీఎం జగన్ ఆశయానికి తాజా ఎన్నికల్లో మహిళల ఆశీర్వాదం తోడైనట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఇందుకు పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు భారీ స్థాయిలో బారులు తీరడమే కారణమని చెప్తున్నారు. పోలింగ్ శాతం పెరుగుదల ప్రభుత్వ వ్యతిరేకత అనే కంటే జగన్ ప్రభుత్వం పట్ల మహిళల నమ్మకానికి ప్రతీకగా పేర్కొంటున్నారు. పోలింగ్ ప్రారంభం నుంచి, ముగిసే వరకు దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాలూ మహిళలతోనే కిక్కిరిశాయి. తమ కుటుంబాలకు పెద్ద దిక్కుగా నిలిచిన జగనన్నను గెలిపించుకోవాలన్న సంకల్పం మహిళల్లో ఎక్కువగా కనిపించినట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

4,177 ఓట్లు ఎక్కువ

యలమంచిలి నియోజకవర్గంలో మొత్తం 2,06,394 ఓట్లు ఉన్నాయి. వీటిలో 85.66 శాతంతో 1,76,807 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో 86,315 మంది పురుషులు, 90,492 మంది మహిళలు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 4,177 మంది అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇదంతా వైఎస్సార్‌సీపీకి కలిసి వస్తుందని ఆ పార్టీ నేతల నమ్మకం.

పెరిగిన ఓటింగ్

2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి 3.75 శాతం అధికంగా నియోజకవర్గంలో ఓటింగ్ జరిగింది. యలమంచిలి నియోజకవర్గంలో 2014 ఎన్నికల్లో 85.12 శాతం ఓట్లు పోలవగా, గత ఎన్నికల్లో కాస్త తగ్గి 82.19 శాతం ఓటింగ్ జరిగింది. తాజా ఎన్నికల్లో అది మళ్లీ పెరిగి 85.94 శాతం నమోదయింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన ప్రజలు ఓటేసేందుకు ఎక్కువగా మొగ్గు చూపినట్లు విశ్లేషకులు చెప్తున్నారు. పెరిగిన ఓటింగ్ వైఎస్సార్‌సీపీకి అనుకూలమని పేర్కొంటున్నారు.

మాడుగులలో...

మాడుగుల రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లు ఎక్కువ శాతం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 69 పోలింగ్ కేంద్రాల్లో 24,182 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకోగా, పురుషులు 23,142 మంది ఓటు వేశారు. పురుషులు కంటే 1,040 మంది మహిళలు అధికంగా ఓటు వేశారు.

నేడు పైడితల్లమ్మ మెరుపుల మహోత్సవం



రాంబిల్లి: మండలంలో ప్రసిద్ధి చెందిన మామిడివాడ పైడితల్లమ్మ అమ్మవారి మెరుపుల మహోత్సవం గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు బుధవారం రాత్రి ఉపవాసాలు ఆచరించి జాగరణ చేశారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రి అమ్మవారు మెరుపుల రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ మెరుపుల ఉత్సవాన్ని తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఉత్సవాల సందర్భంగా బాల సన్యాసమ్మ జానపద నాటకాన్ని బుధవారం రాత్రి ప్రదర్శించారు. గురువారం రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.